## బోయకొండ నిండిన భక్త జనం

### -ఒక్కరోజులోనే రూ.28.60లక్షల ఆదాయం



బోయకొండ(చౌడేపల్లి), జూలై 13 ప్రభాతవార్త
శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఒక్క రోజులోనే వివిధ సేవా టికెట్ల రూపంలో రూ. 28,60,640లు ఆదాయంగా సమకూరిందని ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా కర్నాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాహనాలు కొండపైకి రావడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. ఎసిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## నమ్మించి చంపేశారు.. లేరా శీనన్న!

### బొక్కసం పాలెంలో విషాదం



శ్రీనివాసులు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త
'నమ్మించి నిన్ను చంపేశారు! లేరా శీనన్నా!! అంటూ రోదిస్తుంటే చూపరుల కళ్లు చెమర్చాయి. శ్రీకాళహస్తికి కూత వేటు దూరంలోని బొక్కసం పాళెం గ్రామం ఆదివారం శోక సముద్రంలో మునిగిపోయింది.శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినూత కోట డ్రైవర్‌గా పిఏగా సుమారు 10 సంవత్సరాల నుంచి పని చేసిన శ్రీనివాసులు అనే రాయుడు (21) దారుణ హత్యకు గురయ్యాడు. ఆతని శవం చెన్నైలోని ఓ మురుగునీటి కాలువలో తేలింది. ముదట గుర్తు తెలియని శవంగా పోలీసులు భావించినప్పటికి అక్కడ లభించిన ఆధారాలతో ఆతను శ్రీకాళహస్తిలోని జనసేన ఇన్‌చార్జి వినూత కోట పిఏగా గుర్తించారు. దాంతో కేసు మలుపు తిరిగింది. ఆదివారం పోస్టు మార్టం నిర్వహించి శవాన్ని బందువులకు అప్పగించారు. శ్రీనివాసులు అమ్మమ్మ రాజేశ్వరమ్మ సోదరి కి అప్పగించారు. ఉదయం శవం బొక్కసం పాళెం గ్రామానికి చేరింది. దాంతో ఒక్కసారిగా గ్రామంలో ఏడుపులు,పెడబొబ్బలు చోటు చేసుకున్నాయి. అమ్మమ్మ,సొదరి 'నమ్మించి నిన్ను చంపేశారు. లేరా శ్రీనన్నా'అంటూ రోదిస్తుంటే చూడటానికి వచ్చిన వారి కళ్ళు చెమర్చాయి. గ్రామంలోనూ రేణిగుంటలో తమ అక్క దగ్గర ఉన్నపుడు అందరితో ఎంతో కలగొలుపుగా ఉండే శ్రీనివాసులు అనే రాయుడు ఆకాల మరణాన్ని బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. మా బిడ్డ ఏం తప్పు చేసాడు? ఎందుకు చంపేశారని రోదిస్తూ ఆర్తనాదాలు చేస్తుంటే విషాదం చోటు చేసుకుంది.

**జ్యూడిషియల్ విచారణ జరపాలి: సిపిఐ**

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినూత కొట డ్రైవర్ రాయుడు మృతిపై పలు అనుమానాలున్నాయని జ్యూడిషియల్ విచారణ జరిపి వారి బంధువులకు న్యాయం చేయాలని సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య డిమాండ్ చేసారు. రాయుడు హత్యకు బలమైన రాజకీయ కారణాలున్నట్లు అనుమానాలున్యాయని ఆరోపించారు.ఆతనిని ఎందుకు హత్య చేసారో నియోజకవర్గ ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు.రాయుడు హత్యకు వ్యక్తిగత కారణాలా లేక రాజకీయ కారణాలా అనేది తేలాల్సి ఉందన్నారు.రాజకీయ నాయకుల వద్ద పని చేసే పేదవారికి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## నిరీక్షణలేని దర్శనాలపై అధ్యయనం!



### -సాంకేతిక పరిజ్ఞానం సాయంతో భక్తులకు సులభ సంతోషకర ప్రణాళిక

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
రెండు దశాబ్ధాల కాలంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య సాధారణ రోజుల్లోనూ అనూహ్యంగా రెట్టింపవడం...ఏడుకొండలస్వామి దర్శన సమయం 12-14గంటల నుండి 18-20గంటలకు పెరగడం వెరసి సామాన్యభక్తులు క్యూలైన్లలోనే అసహనం ,ఆవేదన చెందుతుండటం కనిపిస్తోంది. చంటిపిల్లలు, వృద్ధులు, మహిళలు క్యూలైన్లలో, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో 16-24గంటల సమయం నిరీక్షణతో సహనం కోల్పోతున్నారు. కంపార్టుమెంట్లలో అవసరమైన సౌకర్యాలు కల్పించినా ఇష్టదైవమ్ దర్శనం ఆలస్యమవుతుండటంపై సామాన్య భక్తులు పెదవివిరుస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సహనంకోల్పోయిన భక్తులు వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో రచ్చచేయడం, భక్తులు తోపులాట చేసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం లక్షమంది వరకు వస్తున్నా సకల సౌకర్యాతో భక్తులు కొంత సంయమనం పాటిస్తుండటంతో ఇలాంటివి ఎదురవడంలేదు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఈ సమస్యలన్నిటికీ చెక్‌పెట్టేందుకు టిటిడి పాలకమండలి, అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సామాన్యభక్తులకు సంతోషకరమైన ,గంటల గంటలు నిరీక్షణ లేని దర్శనం చేయించాలనే దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. పలు రకాలుగా దర్శన టిక్కెట్లు, దర్శన టోకెన్లు కలిగి తిరుమలకు చేరుకుంటున్న సామాన్యభక్తులకు సాంకేతికత సాయంతో నిర్ధేశించిన సమయంలో దర్శనం చేసుకునేలా చూడాలనే తపనతో కదులుతున్నారు. తిరుమలేశునిరోజుకు 80వేలనుండి 90వేల మంది వరకు భక్తులు మహాలఘులో దర్శనం చేసుకోగలుగుతున్నారు. అయినా భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం అమలవుతున్న టిటిడి దర్శనాల్లో సర్వదర్శనం, సమయ నిర్ధేశిత దర్శనం(ఎస్ఎస్‌డి),ప్రత్యేక ప్రవేశ దర్శనం(ఎస్ఇడి), దివ్యదర్శనం ,ఆర్జితసేవల దర్శనాలు ఇలా పలు రకాలుగా ఉన్నాయి, ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకుండా రోజుకు 20వేలమంది భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారనేది టిటిడి అంచనా. ఈ లెక్కన 80వేలమంది భక్తులు తిరుమలకు వస్తుంటే అదనంగా మరో 20వేలమందివరకు చేరుకుంటున్నారు. క్యూలైన్లలోనికి చేరుకున్న భక్తులకు వెంకన్న దర్శనానికి ఎంత సమయం అవుతోందని,ఆలయం నుండి వెలుపలకు రావడానికి ఎంత సమయం పడుతోందనే వివరాలు తీసుకుని తదనుగుణంగా సులభమైన వేగవంతమైన దర్శనం చేయించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. టిసిఎస్ ,ఐటి విభాగం సంయుక్తంగా ఈ విధానం అమలుకు సిద్దమవుతున్నారు. గంటలతరబడి నిరీక్షణకు చెక్‌పెట్టాలనేది టిటిడి అధికారులు,ఛైర్మన్ ఆలోచన.

## వైభవంగా కోదండరామునికి అశ్వవాహన సేవ



తవణంపల్లె, జూలై 13 ప్రభాతవార్త:
మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సీతా లక్ష్మణ సమేతుడైన కోదండ రాముడు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయ హస్తం అందించారు. ఈకార్యక్రమానికి కుపాల్లపల్లెకు చెందిన కుప్పాల గురుమూర్తి అండ్ బ్రదర్స్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం తిరుపతికి చెందిన డి.సుధాకర్‌రెడ్డి, టి.పుత్తూరుకు చెందిన జె.సుబ్రమణ్యంరెడ్డి,జయప్రకాష్‌రెడ్డి, అమరావతిరెడ్డిలు ఉభయదారులుగా తిరుమంజనం, పాలాభిషేకం ఉత్సవము నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.అనంతరం అలంకరించిన అశ్వ వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు చొరవతో కుప్పానికి పరిశ్రమలు




### 1200కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం .. త్వరలోనే పనులు ప్రారంభం !!

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గానికి పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవలే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా ప్రముఖ పరిశ్రమల తరపున ప్రతినిధులు సిఎం సమక్షంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా మౌఖిక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరిశ్రమలకు అవసరమైన భూములు, అన్ని రకాల అనుమతులు మంజూరుకు చకచకా చర్యలు పూర్తవుతున్నాయి. త్వరలోనే ఈ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పనులు ప్రారంభం కానున్నాయి. కుప్పం ప్రాంతంలో సుమారు 1200కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు ఆయా పరిశ్రమలు ముందుకు వచ్చాయి. ఈ పరిశ్రమల ద్వారా దాదాపు 14 వేల ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయి.

**500కోట్లతో డెయిరీ సంస్థలు :**

కుప్పం ప్రాంతంలో సుమారు 500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రెండు ప్రముఖ డెయిరీ సంస్థలు ముందుకు వచ్చాయి. వీటిలో మదర్ డెయిరీ 260కోట్లు, శ్రీజ డెయిరీ 233 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఇవి పాలసేకరణతో పాటు పాల ఉత్పత్తులు తయారు చేస్తాయి.

**మరో 500కోట్లకుపైగా పెట్టుబడులతో పరిశ్రమలు :**

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఇ -రాయిస్ సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమను కుప్పం ప్రాంతంలో ఏర్పాటుచేయనుంది. ఈసంస్థ దాదాపు 200 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఇ- సైకిళ్లు, ఇ -ఆటోలు, ఇ- టువీలర్ల తయారీ యూనిట్‌ను కుప్పంలో ఏర్పాటుచేయనుంది. ఇక కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న ఎస్వీఎఫ్ సోయా ప్రై.లిమిటెడ్ సంస్థ కూడా కుప్పంలో పరిశ్రమ ప్రారంభిస్తోంది. దాదాపు 372 కోట్ల పెట్టుబడులు కుప్పంలో పెడుతోంది. ఈ పరి శ్రమ సోయా బీన్ ఆయిల్ తయారీ, కోళ్ల పరిశ్రమలకు సోయా మీల్ సరఫరాతో పాటు ఎగుమ తులను నిర్వహించనుంది. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన అలీ ప్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ 26 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ పలు పరిశ్రమలు ఏర్పాటుచేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ద్వారా పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ, మార్కెటింగ్ తదితర సౌకర్యాలు కల్పించనుంది.మహారాష్ట్రకు చెందిన ఏస్ ఇండస్ట్రీస్ పరిశ్రమ సైతం కుప్పానికి రానుంది. ఈ పరిశ్రమ సెంట్రిఫ్యూజ్ మెషిన్ల తయారీ యూనిట్లను కుప్పంలో ఏర్పాటు చేయనుంది. మున్ముందు కుప్పానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయి. ఏది ఏమైనా కుప్పానికి సాధ్యమైనంత ఎక్కువగా పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

## ప్రాణం తీసిన మాయదారి కరెంటు...

### పుత్ర శోకంతో తలడిల్లుతున్న తల్లి....



రేణిగుంట జూలై 13 ప్రభాతవార్త
ఓ కొడుకా ఇంత చిన్న వయసులో మమ్మల్ని వదిలి వెళ్ళిపోయా వా) అంటూ ఓ తల్లి పుట్టెడు దుఃఖంతో కుంగిపోయిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రమరెడ్డి పాలెం డంపింగ్ యార్డ్ లో దాదాపు 50 కుటుంబాలు జీవనోపాధి కోసం అస్సాం నుండి కడుపు చేత పట్టుకొని వచ్చారు. డంపింగ్ యార్డ్‌లో ముక్తార్ హుస్సేన్ (10) తల్లి తండ్రులు పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం సెలవు కావడంతో అందరూ వారికోసం ఏర్పాటు చేసిన షెడ్‌లో ఉన్నారు. పాలు తేవడం కొరకు కుమారుని అంగడికి పంపారు. అంగడికి వెళ్తున్న కుమారుడు విద్యుత్ తీగ చేతికి తగిలి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. 10 సంవత్సరాల కుమారుడు కళ్ళముందే చనిపోవడం ఆ తల్లి దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఎవరు ఎంత ప్రయత్నించిన ఆమె కన్నీటిని ఆపలేకపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ సంఘటన స్థలం చేరుకుని పరిస్థితులు సమీక్షించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయిలో కుప్పం మున్సిపాలిటీకి ఐదవ స్థానం



మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త
కుప్పం మున్సిపాలిటీ మరోసారి రాష్ట్రస్థాయిలో చోటు సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 నగర,పురపాలక సంఘాలకు సంబంధించిన ఆస్తి పను న్నలకు గాను కుప్పం మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో ఐదవ స్థానంలో నిలిచింది. మున్సిపాలిటీలో ఆస్తిపన్ను విలువ 111శాతం పెరిగింది. ఈ జాబితాలో కమలాపురం, మైదుకూరు, సామర్లకోట, ధర్మవరం మున్సిపాలిటీలు తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. పెద్ద పెద్ద నగర కార్పోరేషన్లు, మున్సిపాలిటీలతో పోల్చితే నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన కుప్పం మున్సిపాలిటీ ఆస్తిపన్ను పెరుగుదలలో రాష్ట్రస్థాయిలో ఐదవ స్థానంలో నిలవడం విశేషంగా చెప్పుకోవాలి. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యం విషయంగా మున్సిపాలిటీల్లో నిర్వహించిన ఐవిఆర్ఎస్ సరే వ్లో సైతం కుప్పం మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో టాప్‌టెన్‌లో నిలిచిన విషయం విదితమే. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీని ఆదర్శంగా మలచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ వార్షిక సంవత్సరంలో మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను 111శాతం పెరగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, మున్సిపల్ నిధులతో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

## లారీని ఢీకొన్న కారు

### ఒకరు మృతి ఐదుగురికి గాయాలు



తొట్టంబేడు,జూలై 13ప్రభాతవార్త
శ్రీకాళహస్తికి సమీపంలోని స్వర్ణముఖి నది బైపాస్ మీద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సిఐ నాగార్జున్ రెడ్డి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుమూరు గ్రామానికి చెందిన మనోజ్ కృష్ణ ఆతని స్నేహితులు బాలసాయి, అజయ్, అభిలాష్, పవనలతో కలసి కారులో కోటకు వెళ్ళి వస్తామంటూ బయలు దేరారు. అదే రోజు శనివారం రాత్రి సుమారు 10గంటలకు తామంతా కలసి తిరుపతికి వెళుతున్నట్లు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. మనోజ్ కృష్ణ తండ్రికి స్నేహితులు ఫోన్ చేసి తిరుపతికి వెళుతుండగా శ్రీకాళహస్తికి సమీపంలోని స్వర్ణముఖి నది వంతెనపై ఎదురుగా వెళుతున్న లారీని దాటే క్రమంలో లారీకి ఢీకొందన్నారు. ఈ ప్రమాదం జరిగినపుడు మనజ్ కృష్ణ డ్రైవింగ్ చేస్తున్నారని ఈ ప్రమాదంలో మనోజ్‌కృష్ణ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తండ్రి రాజేంద్రకు సమాచారం అందించారు.ఆయన వెంటనే ఇక్కడకు చేరుకొని ఫిర్యాదు చేసారన్నారు.కేసు నమోదు చేసామని సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు. గాయపడిన వారికి వైద్య నిమిత్తం తరలించామన్నారు.

## స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులో "స్మార్ట్‌సిటీ"తిరుపతి



ప్రభాతవార్త-తిరుపతి:
నిత్యం 60వేలమందివరకు యాత్రికులతో ఐదులక్షలమంది నగరజనంతో సందడిసందడిగా ఉండే తిరుపతినగరం మరోసారి పరిశుభ్రతలో మార్కులేసుకుంది. ఇందుకు నిదర్శనంగా స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులో తిరుపతినగరపాలకసంస్థ చేరింది. పరిశుభ్రత పాటించడంలో, నగరంలో ప్రధాన రోడ్లు, రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు,అలిపిరి వంటి ప్రధాన ప్రాంతాల్లో పరిశుభ్రత తలకుమించిన భారం. అయినా నగరపాలకసంస్థ ఎప్పటికప్పుడు చెత్తాచెదారం శుభ్రం చేయడంలో,నగరాన్ని పరిశుభ్రతగా ఉండచంలో ప్రధాన దృష్టి సారించింది. కేంద్రప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులకు ఎంపికైన రాష్ట్రంలోని ఐదు నగరాల్లో తిరుపతి నగరం ఉండటం ఇదీ తిరుపతివాసుల వరంగా చెప్పవచ్చు. పరిశుభ్రత విషయంలో ఉత్తమ చర్యలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు తగిన విధంగా స్పందించడం విశేషం. తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, నగరపాలక కమిషనర్ మౌర్య,ఆరోగ్యవిభాగం పూర్తిస్థాయిలో పరిశుభ్రతపై దృష్టి పెట్టారు. తిరుపతి నగరం స్వచ్ఛసూపర్‌లీగ్ సిటీ కేటగిరిలో ఎంపికకావడం మరో విశేషం. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించే ఈ సర్వేలో నగరాల్లోని చెత్తాచెదారం తొలగింపు, చెత్తకుండీలు లేని వీధులు, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్రజల సహకారం వంటి అంశాలు పరిగణనలోనికి తీసుకుని ఎంపిక చేశారు. తిరుపతి స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులో ఎంపికకావడంతో పరిశుభ్రతపై మరింతగా ప్రజలకు ,యాత్రికులకు అవగాహన పెంచేందుకు దోహదపడుతుంది. ఇదీ పూర్తిగా నగరపాలక పారిశుధ్యసిబ్బంది, ఆరోగ్యవిభాగం సేవలకు నిదర్శనమనే అధికారులు తెలిపారు.

## రాహుకేతు దోష నివారణ పూజల్లో 'దక్షిణ' ఫిక్సండి

### దోషం పోవాలంటే ఖరారు చేసిన రేట్లు చెల్లించాల్సిందే!

### ఇది శ్రీకాళహస్తి ఆలయంలో భక్తుల దోపిడి

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహిమాన్విత రాహుకేతు దోష నివారణ పూజలతో 'దోషం నివారణ దేవుడెరుగు' పూజలు చేయించుకున్న భక్తుల జేబులు ఖాళీ అవుతున్నాయి.ఇదో వ్యాపారంగా మారింది. ఇక్కడ పని చేయటానికి పోటీలు పడే పూజలు చేసేవారు తాము 'ఇక్కడ లీజును' కొనుక్కున్నామని మరీ వసూళ్ళు చేసుకుంటున్నారు.ఒక్కొక్క టిక్కెట్టు పూజలకు ఒక్కొక్క రేటు ఖరారు చేసి మరీ వసూళ్ళు చేసుకుంటున్నారు. వచ్చిన భక్తుల ముక్కంటీశా ఏమిటీ వ్యాపారం అని నొచ్చుకుంటూ దక్షిణ చెల్లిస్తున్నారు. ఇక్కడకు వచ్చిన భక్తులను అడుగడుగునా మభ్యపెడుతున్నారు. దోచుకుంటున్నారు. చివరకు తిరుగుపయనానికి కాసుల్లేక దుకాణాల వద్ద అడుక్కునే దీన స్థితి కల్పిస్తున్నారు.

**ఒక్కొక్క పూజకు ఒక్కొక్క రేటు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరుపుకుంటే మంచి జరుగుతుందని దేశ విదేశాల నుంచి భక్తులు బారులు తీరుతున్నారు. భక్తుల నమ్మకాన్ని ఇక్కడ పూజలు చేసే పూజారులు,అధికారులు, సిబ్బంది వ్యాపారం చేస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుపుకునే రాహుకేతుదోష నివారణ పూజలు

ఒక్కొక్క టిక్కెట్టుతో పూజలు చేయించుకునే చోట ఒక్కొక్క రేటు ఖరారు చేసి వసూలు చేసుకుంటున్నారు. ఇదేమి రహస్యం కాదు. బహిరంగంగానే రేట్లు ఖరారు చేసి వసూలు చేసుకుంటున్నారు.ఈ తతంగాన్నినడిపించుటకు ఆలయంలో ఓ 'అర్చక బాస్' ఉన్నారు. ఆయన ఆర్చకులకు అధికారులకు మధ్య వర్తిగా వ్యవహారిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే సాగుతున్నాయి. కానీ ఎవ్వరూ పట్టించుకోరు. రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు పూజల తరువాత దక్షిణ రూ.101,రూ.1,500,2,500పూజల్లో రూ.200లు రూ.5,000ల టిక్కెట్టులో రూ.500లు దక్షిణ చెల్లించాల్సిందే అంటూ రేట్లు ఖరారు చేసి మరీ వసూళ్ళు చేసుకుంటూ భక్తుల్ని ఇబ్బంది పెడుతున్నారు. వారు వసూళ్ల చేసే దక్షిణల్లో 'తిలా పాపం తలా కొంచెం'అన్నట్లు పంచుకుంటున్నారనే విమర్శలు బహిరంగానే ఉన్నాయి.దక్షిణ చెల్లించకుంటే పరిహారం పరిపూర్ణం కాదని నమ్మబలికి వసూళ్ళు చేసుకుంటున్నట్లు భక్తులు వాపోతున్నారు. సాధారణంగా పూజలు చేయించుకునే వారు ఎంతో కొంత దక్షిణ పెట్టడం జరుగుతుంది. 'కాంచాణం కర్మ విమోచనం'అన్నట్లు బ్రాహ్మణులకు సమర్పించుకునే సంప్రదాయం ఉంది. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాత్రం రేట్లు ఖరారు చేసి మరీ వసూళ్ళకు పాల్పడటం భక్తుల మనో వేదనకు గురి చేస్తుంది. మరి భక్తులు ఎవరికి మొరబెట్టుకోవాలో తెలియక ఆ ముక్కంటీశునికే తమ బాధను అప్పగించి వెళుతున్నారు.మరి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న 'దక్షిణ' వసూళ్ళకు ఎప్పటికి అంతమో? ఏమో?

# హామీల అమలు ఘనత సిఎం చంద్రబాబుకే

**- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కంగుందిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు పెన్షన్లు, దీపం కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. నిరుద్యోగ యువతకు 16743పోస్టులతో మెగా



డీఎస్సీ, చదువుకునే పిల్లలకు తల్లికివందనం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలతో పాటు అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం చేశారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులకు మరలా శ్రీకారం చుట్టారన్నారు. వచ్చే నెలలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం సైతం అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, వైస్ సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అంతా రామమయం.... శ్రీరామజయం



కల్లూరు, జూలై 13, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం దిగువ పోకలవారిపల్లెలో ఆదివారం రామకోటి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకగా జరుపుకున్నారు. గ్రామంలో ఉదయం రాములవారికి పూజలు నిర్వహించి భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజన బృందాలు రాముల వారి కథను రామకోటిని గానం చేశారు. అంతా రామమయం.. జగమంతా రామమయం.. శ్రీరామ జయం.. అంటూ భక్తులు భక్తి గీతాలు ఆలపించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ



చౌడేపల్లి, జూలై 13 ప్రభాతవార్త

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ అయిన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల సచివాలయం వెనుక భాగంలో వున్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిందకు దించారు. అందులోని విలువైన కాపర్ వైరును దొంగలించుకొని వెళ్ళారు. టవర్ నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారమందించారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు వితరణ: మత గురువులకు సన్మానం



శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్ సారధ్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నెలకు సరిపడ నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా వచ్చిన ఇస్లాం మత గురువులకు సంస్థ తరఫున సత్కరించారు. హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛందసేవా సంస్థ 163నెలలుగా ప్రత్యేక ప్రతిభావంతులకు (అంగవైకల్యం కల్గిన వారికి)నెలకు సరిపడ సరకులను అందిస్తున్నారు. సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషా తన సొంత సంపాదనలో కొంత ఇస్లాం మత సిద్ధాంతాలకు అనుగుణంగా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం వితరణకార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తికి చెందిన ముఫ్తి నాయిం సాహెబ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం పరోపకారం నేర్పుతుందన్నారు. ఈనేపథ్యంలో మునీర్ బాషా ఒకటిరెండు కాదు 163 నెలలుగా క్రమం తప్పక ఆచరిస్తున్నారంటే ఆయన్ను అభినందించాల్సిందే. మునీర్‌ను ఆదర్శంగా మార్గదర్శకంగా అవకాశం ఉన్నవారు సహాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నిరుపేదలకు నిత్యావసర సరకులను అందించారు. సభలో ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కంఠా ఉదయ్‌కుమార్ సంస్థ సభ్యులు బాబా ఫరీద్, లాంకో షరీఫ్, కలాం తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ అసోసియేషన్ సారధ్యంలో సామాజిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం ఆదివారం అధ్యక్షుడు బొమ్మన మధుసూధనరావు అధ్యక్షతన జరిగి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సమావేశం నిర్ణయాలను వివరించారు. కార్యవర్గం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సంఘం సభ్యుల కోసం, సేవా కార్యక్రమాలను చేపట్టాలని చర్చించారు. శివరాత్రి సందర్భంగా భక్తులకు అల్పాహారం అందించాలని తీర్మానించారు. అలాగే హస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేసామన్నారు. ఆలయ పరిసరాల్లో నివశిస్తున్న బిచ్చగాళ్ళకు ఎసేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాలకుముఖ్యఅతిధులుగా హాజరైనజిల్లా ప్రధాన కార్యదర్శి రామూగుప్తా మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రభుత్వం సూచించిన ముఖ్య నిబంధనలు వివరించారు. మందు దుకాణాల నిర్వాహకులు మత్తును కల్పించే మందులను డాక్టర్ అనుమతి లేనిదే అమ్మరాదని వివరించారుమత్తు మందు కోసం దౌర్జన్యం చేస్తే పోలీసుల సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కఠిన చర్యలు ఉ ంటాయన్నారు. అసోసియేసన్ అభివృద్ధి కోసం తన వంతు ప్రయత్నం చేస్తామన్నారు. 40 సంవత్సరాలుగా అసోసియేషన్ ద్వారా సేవలందిస్తున్న వారిని సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో కొండేటి గోపాల్, నరసింహులు, ఆనంద్‌రావు, మధుసూధనరావు, అమరాజనార్ధనఅనంద్‌రాజ్‌గుప్తా, నాగేశ్వం రావు, చక్రపాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిమందు సేవించిన వ్యక్తి మృతి



చౌడేపల్లి, జూలై 13 ప్రభాతవార్త

గడ్డిమందు సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని చిన్నయల్లకుంట్లకు చెందిన టి.గుర్రప్ప(55)వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. తాగుడుకు బానిసైన అతన్ని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన గుర్రప్ప గతవారం పొలం వద్దగల గడ్డిమందును తాగాడు. అపస్మారక పరిస్థితిలో వున్న అతన్ని కుటుంబ సభ్యులు మదనపల్లి, అటు తర్వాత తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గుర్రప్ప మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తిరుపతి రుయాలోనే పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బాబు వన్నీ మోసాలే

పుంగనూరు రూరల్, జూలై 13, ప్రభాతవార్త



చంద్రబాబు నాయుడు మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని, ఆయన అసలైన నైజా న్ని ప్రజలకు ఇంటింటికీ తెలియ జేయాని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పుంగనూ రులో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హామీలు ఇచ్చి అధికారం దక్కించుకోవడం చంద్రబాబుకు అలవాటని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మరిచిపోవడం ఆయన స్వభావమని విమర్శించారు. ప్రజలు మళ్లీ మోసపోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## కుప్పంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- కడ పి.డి. వికాస్ మర్మత్**



**కుప్పం, జూలై 13 ప్రభాతవార్త**

నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజలనుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు.

## నటుడు కోట శ్రీనివాసరావుకు ఘన నివాళులు

కుప్పంరూరల్, జూలై 13ప్రభాతవార్త



సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు మృతి చెందడం పట్ల నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్ అధ్వర్యంలో ఆ పార్టీ నేతలు ఘన నివాళులు అర్పించారు. కోట శ్రీనివాసరావు చిత్రప టంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు సినీ పరిశ్రమ ఓ మంచి నటుడ్ని కోల్పో యిందని తులసినాథ్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మండల అధ్యక్షుడు వడివేలు, శ్రీహరి, శ్రీధర్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది



రామకుప్పం, జూలై 13 ప్రభాతవార్త

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది కలిగించడం జరుగుతుందని మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు విశ్వనాథ పేర్కొన్నారు. ఆదివారం పంద్యాలమడుగు, రామకుప్పం పంచాయతీల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. ప్రజల సమస్యల పరిష్కారంకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు వెంకటరమణ, విజయకుమార్‌రెడ్డి, నవీన్, శ్రీనివాసులు, కేశవరెడ్డి, సుబ్బన్న, చలపతి, సాహిత్‌రెడ్డి, సురేంద్ర, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

పూతలపట్టు, జూలై 13, ప్రభాతవార్త



పూతలపట్టు మండలం కూల్ బీవ్ పరిశ్రమ నుంచి వస్తున్న వ్యర్థాలు, కెమికల్ వేస్ట్ వాటర్ భరించలేని వాసనతో బయటకు పంపిస్తున్నారు. వీటికి ఎలాంటి స్టోరేజ్ లేకుండా రహదారి పక్కనే వదిలేయడంతో వాహన దారులు ముక్కులు మూసుకుని పోయే పరిస్థితి ఏర్పడినది దీనివలన భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అంతేకాకుండా ఆ వ్యర్థాల వలన దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అవుతున్నాయి. దీనివలన ప్రజలు రోగల బారిన పడుతున్నారు.

## గృహ దీక్షలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు

పుంగనూరు, జూలై 13, ప్రభాతవార్త



పట్టణంలో 2003 డిఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు ఆదివారం గృహదీక్షలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమొ 57 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2003 డీఎస్సీ నందు ఎంపికైన ఉపాధ్యాయులు 7361 మందికి, పోలీసులు 1821 మందికి, గ్రూపు 1,2 ఆఫీసర్స్ 1800 మందికి వెరసి 11000 మందికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం మెమో జారి చేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఉత్తర్వులను అమలు చేయుట పోవడంపై డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం పిలుపు మేరకు 2003 ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో గృహదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్సీ 2003 చిత్తూరు జిల్లా ఫోరం కన్వీనర్ ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బోడే మోహన్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో గృహదీక్షలో పాల్గొన్నారు. అదే విధంగా ఈనెల 18 వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన కార్యక్రమంకు జిల్లాలోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## హైవే హోటల్స్‌లో భారీ మోసం



పుంగనూరు, జూలై 13, ప్రభాతవార్త

చెన్నై ముంబై నేషనల్ హైవేస్ పైన ఏర్పడిన అనేక హోటళ్ళు భారీ మోసానికి పాల్పడుతున్నాయని ప్రయాణికుల ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పలమనేర్ నుంచి చిత్తూరు మధ్య మార్గంలో ఏర్పడిన పలు హోటళ్ల వద్ద ఆగే బస్సుల ప్రయాణికుల వద్ద నుంచి ఈ హోటల్లో యజమానులు నాసిరకం భోజనాలు ఆహార పదార్థాలతో దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సాధారణంగా పట్టణాల్లో హోటల్లో వద్ద లభించే భోజనం విలువ 60 రూపాయలు ఉండగా అన్ని రకాల రుచికరమైన ఆహార పదార్థాలు వండిస్తారు. కానీ పలమనేర్ నుంచి చిత్తూరు మార్గంలోని పలు హోటళ్ల వద్ద ఆగే బస్సులలో ప్రయాణికులు భోజనం దారుణంగా ఉంటోందని, ధర కూడా 90 రూపాయలకు మించి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. హోటళ్ల వంటశాలలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని శుభ్రత లేదని ఆరోపిస్తున్నారు. పోలీసులు సానిటరీ అధికారులు ఈ హోటళ్లపై దాడులు నిర్వహించాలని, వంటశాలల నిగ్గు తేల్చాలని, ధరలు అదుపులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు.

## గణనాధుని దర్శించుకున్న ఏపీ హైకోర్టు విశ్రాంత జడ్జి

కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:



ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ శేషసాయి ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవర సిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు సూపరెండెంట్ కోదండపాణి, వాసు, స్థానిక కాణిపాకం ఇన్‌చార్జి ఎస్సై చిరంజీవిలతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులచే విశ్రాంత ఉపాధ్యాయునికి ఘన సత్కారం



తవణంపల్లె, జూలై 13 ప్రభాతవార్త:

తమకు విద్యాబుద్దులు నేర్పి తమ ఉన్నతికి కారకులైన ఉపాధ్యాయునికి పూర్వ విద్యార్థుల బృందం ఘనంగా సత్కరించి ఆశీస్సులందుకున్న అరుదైన సంఘటన మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... టి.పుత్తూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇ.జె.విజయకృష్ణారెడ్డి అనే వ్యక్తి 1992 నుండి 2003 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులకు నిస్వార్థంగా క్రమ శిక్షణతో కూడిన విద్యాబుద్దులు నేర్పడంతో వారందరూ ప్రయోజకులయ్యారు. ఆయన వద్ద విద్య నేర్చుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నత శిఖరాల్లో వున్నారు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు గత ఏడాది తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. అయితే తమ విద్యనేర్పించి తమ ఉన్నతికి కారకులైన ఇ.జె.విజయకృష్ణారెడ్డిని పూర్వ విద్యార్థులందరూ గ్రామానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించి ఆశీస్సులందుకున్నారు. ఉడతా భక్తిగా తమ గుర్తుగా బంగారు బ్రాస్‌లెట్‌ను బహుమతిగా ఆయనకు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల పూర్వవిద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి

ఐరాల, జూలై 13 ప్రభాతవార్త:



మండల కేంద్రం ఐరాల జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటే 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా త్వరలో జరుప తలపెట్టిన పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతంచేయాలనిపాఠశాలపూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. ఆదివారం పాఠ శాల ఆవరణలో పూర్వ విదా ్యర్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు ఆధ్వర్యంలో కార్యవర్గం సమావేశం జరిగింది. పాఠశాల వ జ్రోత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈసందర్భంగా సీతాపతి నాయుడు మాట్లాడుతూ వజ్రోత్సవాలల్లో

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**- ఇరవై ఏళ్ల తర్వాత కలసిన అధ్యాపకులు.. విద్యార్థులు !!**

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

వారంతా ఇరవై ఏళ్ల క్రితం ఓ చోట చదువుకున్న విద్యార్థులు.. అనంతరం వారంతా వేర్వేరు చోట్ల వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు.. అయితే ఇరవై ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో తాము చదువుకున్న కళాశాలలోనే అందరు స్నేహితులు కలవాలని నిర్ణయించుకుని ఇరవై ఏళ్ల అనంతరం వారంతా కలసి ఆనందంగా, ఉత్సాహంగా గడిపారు. ఇందుకు కుప్పంలోని డా॥ జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికైంది. 2005-08 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కాలేజ్‌లో డిప్లమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్



కోర్సు చదివిన విద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అధ్యాపకుల విద్యాబోధనతో తాము ఉన్నత స్థితికి చేరామని గురువుల రుణం తీర్చుకోలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగన్నాథరావు, ఇసిఇ హెచ్ఒడి రామకృష్ణారావు, అధ్యాపకులు జిఎన్ రమేష్, షణ్ముగం, వెంకటరమణన్, మహేష్, ప్రవీణ్, శిరీష పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐటిడిపి అధ్యక్షుడు వినోద్‌కుమార్, రుద్రయ్య, శబరీష్, చౌడప్పల అధ్వర్యంలో నిర్వహించారు.

## స్టోన్ డస్ట్ ముసుగులో తమిళనాడుకు ఇసుక తరలింపు

**- 7 టిప్పర్లు పట్టివేత, 7 మంది డ్రైవర్లు అరెస్టు**

**పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:** తమిళనాడు సరిహద్దు వద్ద స్టోన్ డస్ట్ ముసుగులో ఇసుకను తీసుకెళు తున్న ఏడు టిప్పర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. 90 శాతం ఇసుకతో నిండిన ఈ టిప్పర్లపై పూతలా పది శాతం మాత్రమే స్టోన్ డస్ట్ ఉండటాన్ని గమనించారు. టిప్పర్‌డ్రైవర్లు తమిళనాడుకు కనకమ్మసత్రంకు చెందిన వి.జయకృష్ణ(38), కల్పాకంకు చెందిన ఎస్.పాండియన్(42) కల్లకురిచ్చికి చెందిన ఏ.అజిత్‌కుమార్(29), పెరమందూరుకు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్(28), కన్యాకుమారికి చెందిన ఏ.ఎస్.శ్రీజిత్(26), తాంబరంకు చెందిన ఎస్.అశోక్(31), నగరి మండలం గుండ్రాజుకుప్పంగ్రామానికి చెందిన వి.దేవరాజులు(62)లను అరెస్టు చేశారు. సీఐ విక్రమ్, తహసీల్దార్ రవికుమార్‌ల కథనం మేరకు... ఆదివారం వేకువ జామున రాబడిన సమాచారం మేరకు... సీఐ, తహసీల్దార్ తమ సిబ్బందితో నగరి-తిరుత్తణి మెయిన్ రోడ్డులో తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వద్ద తమిళనాడుకు ఇసుకతో వెళుతున్న ఏడు టిప్పర్లను పట్టుకున్నారు. ఇసుకపై స్టోన్ డస్ట్ వేసి కొంత కాలంగా తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించగా చెన్నై నుంచి నగరికి వచ్చి గుండ్రాజుకుప్పం వద్ద గల వేల్ అండ్ కో స్టోన్ క్వారీని లీజుకు తీసుకున్నాడు. తమిళనాడులోని కొంత మంది లారీ ఓనర్లను సిండికేట్ చేసి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఇసుక రీచ్ నుంచి ఇసుకను లోడ్ చేసుకుని, నగరిలోని వేల్ అండ్ కో క్రషర్ వద్దకు తెచ్చేవాడు. అక్కడ ఇసుకపై స్టోన్ డస్ట్ నింపి పరదాలు కట్టి సరిహద్దు దాటించేస్తూ వచ్చాడు. స్టోన్ డస్ట్ తరలింపులో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో సులభంగా సరిహద్దు దాటించేసేవారు. ఇలా కొన్ని నెలల పాటు చేస్తున్న వీరు పెద్ద మొత్తంలోనే కాసులు కూడాగడించారు. ఇలా తరలిస్తుండడంపై పోలీసులకు సమాచారం అందడం, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు టిప్పర్లనఉ పట్టుకోవడంతో అసలు బండారం బయట పడింది. అంత రాష్ట్ర ఇసుక స్మగ్లింగ్ వెలుగు చూసింది. తహసీల్దార్ సమక్షం లో ఇసుకను సీజ్ చేసిన సీఐ, నిందితులన రిమాండ్‌కు తరలించారు. త్వరలో క్రషర్ నిర్వాహకుడు భరత్‌ను తెర వెనుక ఉన్న ప్రధాన సూత్రదారులను పట్టుకుంటామన్నారు. ఇసుక టిప్పర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన రెవెన్యూ సిబ్బంది మేఘవర్ణం, గోవిందరెడ్డి, వెంకటపతి, పోలీసులు గజేంద్ర, అశోక్, సత్య, పురుషోత్తం, శేఖర్, కిషోర్, రమేష్‌లను సీఐ, తహసీల్దార్ అభినందించారు.

## అంజిమేడులో తొలిఅడుగు



శ్రీకాళహస్తి రూరల్,జూలై 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ఏర్పేడు మండలం కీలకమని ఈ మండల అభివృద్ధికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ వహించి ముందడుగు వేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను అంజిమేడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాదిలో శ్రీకాళహస్తిలో చేపట్టిన అభివృద్ధి గురించి మాట్లాడుతూ విమానాశ్రయం అభివృద్ధితో పాటు నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు విద్యాహబ్‌గా తీర్చి దిద్దుతున్నారన్నారు. అంతేకా ఎస్ ఎస్ కెనాల్‌ను అనుసంధానం చేసి సాగునీటిని అందించుటకుప్రత్యేనిధులు సాదించారని వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజునాయుడు, ధనంజయులు నాయుడు రెడ్డివారి గురువారెడ్డి, రవినాయుడు, గుణా యాదవ్ శివశంకర్‌రెడ్డి కృష్ణప్ప మొదటియార్, కృష్ణవేణి, మనో హర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, జయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో వర్గ రాజకీయంను సహించేది లేదు : శంకర్‌రెడ్డి

***సత్యవేడు, జూలై 13 ప్రభాతవార్త:*** సత్యవేడు నియోజకవర్గంలో ఇకపై టీడీపీలో ఎటువంటి గ్రూప్ ఇజంకు తావులేదని, అందరూ కలసికట్టుగా ముందుకు వెళ్లాల్సిందేనని నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం శ్రీసిటీ ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించిన నేపథ్యంలో అప్పయ్యపాళెంలో నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం జరిపారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడమే తన ముందున్న కర్తవ్యం అన్నారు. పార్టీ ప్రతిష్టకు నష్టం వాటిల్లేటట్టు పార్టీ శ్రేణులు వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీలో అందరిని కలుపుకుని పోవాల్సిన కర్తవ్యం తనపై ఉందన్నారు. కానీ పార్టీలో మొదటి నుంచి అంకితభావంతో పనిచేసే సీనియర్ నాయకులకు అన్నిట్లోను ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరమ శివం, పీవీ పురం బాలరాజు, సుబ్రహ్మణ్యం రాజు, మురళి(చికెన్ చిన్న), శశిమోహన్ నాయుడు, జడేరి బాబు, దయ, సురేంద్ర రెడ్డి, నాగలాపురం బాలాజీ రెడ్డి, నారాయణవనం గిరి, పిచ్చాటూరు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 5వ రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్ - 2025 ముగింపు వేడుక

తిరుపతి క్రీడ, జూలై 13, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని గిరిజన భవన్ ఇండోర్ హాల్, బైరాగిపట్టె వద్ద జూలై 12, 13 తేదీలలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్ - 2025 పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏ.పి. క్రీడా భారతీ అధ్యక్షులు ఒలింపియన్ ఎం.వి. మణిక్యాలు, విశ్వం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటరావు ఆంధ్రప్రదేశ్ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. వి. శివ కుమార్, రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. సాయి సుమతి, ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఏ.జి.రత్న రాణి, ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఎన్. శ్యామల, ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మురళి కృష్ణ పాల్గొనట్లు ఆంధ్రా ప్రదేశ్ స్పోర్ట్స్ క్రీడా భారతీ జాయింట్ సెక్రటరీ సురేంద్ర రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేయడంతో పాటు వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ పోటీలు యువతలో క్రీడాపై ఆసక్తిని పెంపొందించడంలో మైలురాయిగా నిలుస్తాయని ముఖ్య అతిథులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రాప్లింగ్ అసోసియేషన్‌కు ప్రతి ఒక్కరూ అభినందనలు తెలిపారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం అందుకున్న రిత్విక్ యాదవ్

సత్యవేడు, జూలై 13 ప్రభాతవార్త:



గత ఐదు నెలల క్రితం చెన్నైలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పాల్గొన్న రిత్విక్ యాదవ్ సత్యవేడు కరాటే అకాడమి ఆధ్వర్యంలో జరిగిన ప్రశంసాప్రతం ప్రధానోత్సవం కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ కోషి, పి.విల్సన్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూలు ఆడిటోరియంలో జరిగిన ఈ ప్రశంసాపత్రం ప్రధానోత్సవం కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడవ బ్లాక్ బెల్ట్ విల్సన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేదీ తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ చెన్నైలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెంట్ లార్జెట్స్ కరాటే లెసన్(సింగిల్ వెన్యూ)లో సత్యవేడు కరాటే అకాడమి నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఆయన తెలిపారు. అంతేకాకుండా రిత్విక్ యాదవ్ ఇప్పటికే పలు కరాటే పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచినట్లు ఆయన మరోమారు గుర్తు చేశారు. చిన్న పిల్లలకు కరాటే శిక్షణ ఇవ్వడంలో మాస్టర్ భువనేష్ ప్రత్యేక శైలి కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, కరాటే మాస్టర్స్ గోపి, సతీష్, తిరుపతి, సూర్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్వీఐసీసీఏఆర్‌లో ల్యూమినల్ జీఐ క్యానర్‌పై

తొలి సీఎంఈ సదస్సు

తిరుపతి హెల్త్, జూలై 13 ప్రభాతవార్త :



ఏపీ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ (ఏపీఏఎస్ఓ) ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీఐసీసీఏఆర్ ల్యూమినల్ జీ ఐ కాన్సర్‌పై తొలి సీఎంఈ సదస్సు జరిగింది. ఆ సంస్థ వైద్య నిర్వహణ దర్శకుడు, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత్ పెనుమడు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇండో అమెరికన్ క్యాన్సరల్ ఆస్పత్రి, హైదరాబాదుకు చెందిన డాక్టర్ బసవతారకం, వెంకటేశ్వర క్యాన్సరల్ ఆస్పత్రి గుర్గావ్ ఐఏఎస్‌వో కార్యదర్శి డాక్టర్ రుద్ర ప్రసాద్ ఆచార్య, డాక్టర్ నరేంద్ర హులికల్ డాక్టర్ మురళీ, కృష్ణ వోనా డాక్టర్ ఎంజీ నాగకిషోర్, రుయా డాక్టర్ హరికృష్ణ,పలువురు డాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్‌ను గురించి వివరించారు.అవగాహన, పరిశోధన కార్యక్రమాల్లో ఎస్వీఐసీసీఏఆర్ చురుగ్గా భాగం అవుతోందని తెలియజేశారు.

## 17న బెంట్లీ ఇన్నోవేషన్ డే

తిరుపతి విద్య జూలై 13 ప్రభాత వార్త

ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 17న బెంట్లీ ఇన్వెన్షన్ డే నిర్వహించనున్నట్లు పి ఆర్ ఓ మహేష్ ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ సిటీలు, హైస్పీడ్ రైలు నుండి డిజిటల్ నీటి వ్యవస్థలు, స్థిరత్వంతో కూడిన ఇంధన నెట్వర్క్ వరకు మౌలిక సదుపాయాల పరంగా పరివర్తన దశలో భారతదేశం ఉంది. మౌలిక సదుపాయాల రంగాలలో అర్థవంతమైన పురోగతిని నడిపిస్తున్న డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాఫ్ట్వేర్ పరిష్కారాలను అన్వేషించడానికి ప్రభుత్వం,పరిశ్రమ, సాంకేతిక నాయకులను ఈ కార్యక్రమం ద్వారా ఒకచోట చేర్చనుంది. పరిశ్రమ నాయకుల నుండి పరిజ్ఞానంతో కూడిన చర్చలు, డిజిటల్ ట్విన్ అప్లికేషన్ల ప్రత్యక్ష ప్రదర్శనలు, డిజిటల్ డెలివరీ, డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్ సొల్యూషన్లు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఎలా రూపొందించాయి, నిర్మించాయి,నిర్వహిస్తున్నాయి అనే దానిపై ఆకట్టుకునే సెషన్లను ఈ కార్యక్రమంతో ఆశించవచ్చు అని పేర్కొన్నారు. బెంట్లీ ఇన్నోవేషన్ డే లో పాల్గొనటానికి ఆసక్తి కలిగిన వ్యక్తులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోజుకు 18గంటలు పని చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరే!

ఎస్‌సివి నాయుడు



తొట్టంబేడు,జూలై 13 ప్రభాతవార్త భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా రోజులో 18 గంటలు పని చేసే ముఖ్యమంత్రి ఒక్క చంద్రబాబు నాయుడే అని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు. తొట్టంబేడు మండలంలోని తంగేళ్ళ పాళెం పంచాయతీలోని కత్తివారి కండ్రిగ, బసవన్న గుంట గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ సమస్యలను పరిష్కరించటంలో అభివృద్ధికి 'బ్రాండ్ చంద్రబాబు' అన్నారు. సామాజిక అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఐదేళ్ళ పాటు తట్టెడు మట్టి పోయని రోడ్లకు సింగారాలు అద్దారన్నారు.ప్రత్యేక నిధులు అందించి అద్దాల్లా తీర్చి దిద్దారన్నారు.ఇక ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుకు నిధుల కొరత ఉన్నా అమలు చేస్తున్నారన్నారు.గత ప్రభుత్వ హాయంలో పెన్షన్లు ఎప్పుడు వచ్చేదో తెలియదు. ఉద్యోగస్తులు జీతాలు ఎప్పుడు అందుతాయో అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుందన్నారు.నేడు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రూ.4వేలు పెన్షన్ ఒకటవ తేదీ పొద్దుపొడవక ముందే అందిస్తున్న రాష్ట్రం ఒక్క ఆంధ్ర ప్రదేశే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడే అన్నారు. అలాగే ఈ ప్రాంతాలకు సాగునీరు అందించిన ఘనత కూడా చంద్రబాబునాయుడుదే అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటుసర్పంచ్ చెంచుకృష్ణమనాయుడు తెలుగుదేశం నాయకులు ఎస్‌సివి దిలీప్, ఎస్‌సివి కిరన్, సీనియర్ నాయకులు గురుదశరథన్,మోహన్‌నాయుడు, అజూరు రఘురాం,ఢిల్లి ప్రతాప్; సుదర్శనం నాయుడు, నారాయణయాదవ్,చందు తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల వారి సందులో పొంగళ్ళు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిపట్టణ నడిబొడ్డులో వెలసిన గంగమ్మత ల్లి రాయి వద్ద ఆదివారం ఈ వీధికి చెందిన భక్తులు పొంగళ్ళు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరిపారు.అమ్మవారిని కుమార్ అనే యువకుడు చక్కగా అలంకరించాడు. ఉదయం అమ్మవారికి పొంగళ్ల నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారికి అంబలి ప్రసాదాన్ని వితరణ చేసారు. అమ్మవారి అలంకారాన్ని చూడటానికి వేయికళ్ళు చాలవన్నట్లు తీర్చి దిద్దారు.వేసవి కాలం ఈ ప్రాంతాల్లో కొలుపులు,పొంగళ్ళు జాతరలునిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో పిట్టల వారి సందులో కొలుపు నిర్వహించి మొక్కులు తతీర్చకున్నారు.

## ఎస్‌సి బాలికల హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో ఎస్‌సి బాలికల హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. తిరుపతిజిల్లా సహాయ కార్యదర్శి కోగిల మునిచందు,నియోజకవర్గ ఇన్‌చార్జి అభిలు ఆదివారం హాస్టల్‌లో విద్యార్థినులతో కలసి భోజనం చేసారు.ఆదివారం కావటంతో విద్యార్థులందరూ హాస్టల్‌లోనే ఉండటంతో వారితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్‌లో రక్షణ కరువైందని ప్రహరీ గోడ లేనందువల్ల ఆకతాయిలు, పందులు, కుక్కలు లోపలకు వస్తున్నాయని వెంటనే ప్రహరి గోడను నిర్మించి రక్షణ కల్పించాలని కోరారు.

## శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో హత్యారాజకీయాలు బాధాకరం

అంజూరు శ్రీనివాసులు



శ్రీకాళహస్తిరూరల్ జూలై 13 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో హత్యారాజకీయాలు కూడా చోటు చేసుకోవటం బాధాకరమని ధర్మకర్తల బోర్డు మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన తన సహాచరులతో మండలంలోని బొక్కసం పాళెం గ్రామానికి వెళ్లి హతుని కుటుంబాన్ని పరామర్శించారు. జనసేన శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినూత కోట వద్ద సుమారు ఏడు సంవత్సరాలుగా నమ్మకంగా పని చేస్తున్న శ్రీనివాసులు అనే రాయుడును ఎందుకు హత్య చేసారన్నది విచారణలో తేలాలని అన్నారు.హత్యకు కారణాలు అంతకు ముందు ఏం జరిగిందనే అంశాలపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని కానీ కర్మ ఏడు జన్మలైన వదలిపెట్టదన్నారు.ఇలాంటి హత్యారాజకీయాలు ఎప్పుడూ జరగలేదన్నారు.అలాంటిది కక్షతో ఓ నిండు ప్రాణాన్ని బలికొనటం గమనిస్తే శ్రీకాళహస్తి రాజకీయాల్లో హత్యారాజకీయాలు ప్రవేశించాయన్నారు. రాజకీయం అంటే ఇంత దిగజారిపోతాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారని అంజూరు తారక శ్రీనివాసలు అన్నారు. శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పిస్తూ కుటుంబసభ్యులతో మాట్లాడారు. సంతాపం తెలిపారు. అమ్మమ్మ,సోదరిని ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో కాపు సంఘ నాయకులు దండి రాఘవయ్య, సాధన మునస్వామి,జయశ్యామ్ రాయల్, సూర సురేష్,పెరుమాళ్ చౌదరి, బుగ్గ హరిరాయల్, మైనారిటి నాయకులు పఠాన్ ఫరీద్‌ఖాన్ గోరా,ఫజల్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు కుప్పంలో శ్రీసత్యసాయి ప్రేమప్రవాహిని రథయాత్ర

కుప్పంరూరల్, జూలై 13 ప్రభాతవార్త

భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా మంగళవారం కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహించనున్నట్లు కుప్పం సత్యసాయిసేవా సమితి కన్వీనర్ నాగే ంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ద్రవిడ వర్సిటీ మీదుగా గుడుపల్లె మండలం, అనంతరం కుప్పం పట్టణం, శాంతిపురం, వి.కోట దాకా రథయాత్ర కొనసాగుతుందన్నారు.

## బిజెపి మండల కన్వీనర్‌గా గంపల జయప్రకాష్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై 13 ప్రభాతవార్త:



బిజెపి తిరుపతిరూరల్ మండల కన్వీనర్‌గా గంపల జయప్రకాష్‌రెడ్డిని నియమితులయ్యారు. ఆదివారం శ్రీనాథ్ ధామంలో మేడసాని పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో జయప్రకాష్‌రెడ్డి పేరు ప్రపకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం సమర్ధవంతంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి, కెపిఆర్‌నాయుడు, హేమాద్రి నాయుడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయండి..!

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్

చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త:



జనసేన పార్టీని గ్రామీణ ప్రాంతాలలో మరింత బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేష కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహార్ పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించడానికి ప్రతిఒక్క సైనికుడు ప్రజలతో మమేకం కావాలన్నారు. ఆ మేరకు చురుకైన, పార్టీ పట్ల అంకితబావం కలిగిన కార్యకర్తలకు తగిన బాధ్యతలను అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా నియమించినట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు పార్టీకి చేరవేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలను, ఇంటింటి ప్రచారం, యువతలో చైతన్యం, సోషల్ మీడిలో వినియోగం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు శ్రవణా నక్షత్రం (జన్మ నక్షత్రం) ను పురస్కరించుకుని ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌కు ఘన సన్మానం

రామచంద్రాపురం, జూలై 13 ప్రభాతవార్త:



సింగిల్ విండో చైర్మన్‌గా ఎంపికైన చేకూరి జనార్ధన్ చౌదరికి ఆదివారం పూర్వ విద్యార్థులు 1982-83 10వ తరగతి బ్యాచ్ స్నేహితులు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో కెకెవి పురం, జడ్పీ హై స్కూల్లో చదువుకున్న విద్యార్థులు గజమాలతో సన్మానించి గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అతని చేసిన సేవా కార్యక్రమాలు మంచి గుర్తింపును తీసుకువచ్చాయన్నారు. రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్నేహితులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను కంటతడి పెట్టించిన కర్ణ జననం

రామచంద్రాపురం, 13 ప్రభాతవార్త:



చుట్టుగుంట రామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా కర్ణ జననం హరికథ ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. ఆదివారం ధర్మరాజు ఆలయ ఆవరణలో భాగవతారిణి అనసూయ కర్ణ జననం హరికథను కళ్ళకట్టినట్లు వివరించారు. కుంతీదేవి వివాహానికి ముందు సూర్య భగవానుడిని స్మరించుకుని గర్భందాల్చినట్లు తెలిపారు. ఈ నేపధ్యంలో కర్ణుడు జన్మించడం, కర్ణుడిని గంగానదిలో వదిలిపెట్టడంతో అధిరధుడు, రాధలకు లభించడం వంటి ఘటనలను చక్కగా వినిపించారు. అధిరధుడు, రాధల వద్ద పెరుగుతుండగా దుర్యోధనుడికి మంచి స్నేహితుడు అయినట్లు తెలిపారు.

## సత్ప్రవర్తనతో మెలగండి....

రేణిగుంట జూలై 13 ప్రభాతవార్త



రౌడీ షీటర్లు, అనుమానితులు సత్ప్రవర్తనతో మెలుగుతూ వారానికి ఒకసారి పోలీస్ స్టేషన్కు హాజరవ్వాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం రౌడీ షీటర్లు, అనుమానితులతో సిఐ జయచంద్ర కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. రౌడీ షీటర్లు తప్పనిసరిగా వారానికి ఒకసారి పోలీస్ స్టేషన్ కు రావాలన్నారు. పాత పద్ధతులను మార్చుకొని మంచి ప్రవర్తన కలిగి ఉంటే ఉన్నతాధికారులకు సిఫార్సు చేసి వారిపై రౌడీషీటర్లు లేకుండా చేస్తామన్నారు. ప్రతి రౌడీషీటర్ తప్పనిసరిగా జనజీవన ప్రవంతిలో కలిసి ప్రజలతో మమేకమై మంచి ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు.

## డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్లకు ఘన సన్మానం

తిరుపతి హెల్త్, జూలై 13 ప్రభాతవార్త :




రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ సంబరాలు ఆదివారం స్థానిక కచ్చపీ ఆడిటో రియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దుర్గా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఏపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, సీనియర్ రిపోర్టర్ నడిమింటి చంద్రకళారెడ్డి,పలువురు హాజరై శాలువ, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. రీచ్ గ్లోబల్ పౌండేషన్ ద్వారా డాక్టర్ లింగుట్ల చేసిన సేవలను వారు కొనియాడారు.

## ఇంకెంత కాలం ఈ దుస్థితి

బస్టాండ్ కూడలి వద్ద వాహనచోదకులు ఇక్కట్లు , వైసిపి సీనియర్ నాయకుడు మస్తాన్

చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త:



స్థానిక టవర్ క్లాక్ వద్ద ఏరియా ఆసుపత్రికి వెళ్ళేదారిలో గ్రిల్స్‌తో ఏర్పాటు చేసిన కాలువ దుస్థితిని వాహన చోదకులు ఇంకెంత కాలం భరించాలని వైసిపి సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మస్తాన్ ప్రశ్నించారు. ఈ కాలువను పంచాయతీ అధికారులు శాశ్వత ప్రాతిపధికన నిర్మించి వాహన చోదకుల ఇబ్బందులను తొలగించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత కొంత కాలం క్రింత మండల పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అయితే కార్యక్రమం మంచిదే అయినప్పటికీ అత్యంత భారీ లోడ్ లారీలు, టిప్పర్లు ఈ మార్గంలో వెళ్ళి రావడంతో ఇక్కడ కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్స్ బరువును తట్టుకునే శక్తిలేక లోపలికి వంగిపోయాయి. అయినప్పటికి పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి తమ ఫిర్యాదుపై స్పందించి మరమత్తులు చేసినప్పటికీ పరిస్థితి పునరావృతమవుతున్నది. ఈ నేపధ్యంలో శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా ఈ మార్గంలో ప్రయాణించే విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయ వాహనాలకు, ఏరియా ఆసుపత్రి అత్యవసర వాహనాలకు, వైద్య సిబ్బంది, రోగుల వాహనాలకు, కాలనీ ప్రజల వాహనాలకు, వారపు సంతకు వచ్చే వాహనదారులకు సురక్షిత ప్రయాణాన్ని అందించాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## కోట శ్రీనివాసరావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాడు

రంగస్థలి నివాళి



**తిరుపతి రవాణ, జూలై 13ప్రభాతవార్త** విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని రాయలసీమరంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి అన్నారు. నటనా చాతుర్యంతో తెలుగుప్రజలను మెప్పించ గలిగిన ఆయన మృతి తెలుగుసినీపరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో కోట చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆనాటి నటీనటుల నుండి ఇప్పటి నటీనటులతో కలసి పనిచేసిన కోట శ్రీనివాసరావు తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. రాయలసీమరంగస్థలి కళాకారులు కెఎన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం, చంగల్‌రాయలు,జేజిరెడ్డి నివాళులర్పించారు.

## ఫస్ట్ ఏడీజే ఏపీపీగా నియమితులైన చంద్రశేఖర్‌కు అభినందనలు

తిరుపతి కలెక్టరేట్, జూలై 13 ప్రభాతవార్త :



చిత్తూరు జిల్లా కోర్టుల సముదాయ భవనంలో ఉన్న మొదటి అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా మద్దిపట్లపల్లి చంద్రశేఖర్ నాయుడుని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ యువజన రాష్ట్ర అధ్యక్షులు, టీడీపీ యువ నేత శంకర్ యాదవ్‌తో పాటు శంకర్ యాదవ్ సేన, మిత్రులు ధనంజయులు, హరి,శ్రీకాంత్,శ్రీను, సాయి, మధు, అనిల్ చంద్రశేఖర్‌ను శాలువ,పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరెన్నో పదవులు పొందాలని శంకర్ యాదవ్ ఆకాంక్షించారు. ఈయన గతంలో జీపీ (గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేసిన విషయాన్ని శంకర్ యాదవ్ గుర్తు చేశారు.

## వైభవంగా శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణ మహోత్సవం

తిరుచానూరు, జూలై 13 ప్రభాతవార్త :



సనాతన ధర్మ వారధి కేసీ దాస్ ట్రస్ట్ విభాగ సమన్వయ కర్తలు కె. రాధాకృష్ణ, పి. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరులోని శ్రీ మహాలక్ష్మి కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరిగింది. గురు దంపతి పూజ్య బ్రహ్మశ్రీ కల్వకోలను శ్రీరామచంద్రమూర్తి, అమ్మ జయలక్ష్మి శుభ ఆశీస్సులతో లోక కల్యాణం, కోటి హనుమాన్ చాలీసా, గణపతి మూల మంత్రం, సీతారామ కల్యాణం, సామూహిక వరలక్ష్మి వ్రతం, కార్తీక మాసంలో శివార్చన వంటి కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల ఆశీస్సులను పొందారు.

## తిరుపతి జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

6వ జిల్లా స్థాయి ఎంపిక



తిరుపతి క్రీడ, జూలై 13, ప్రభాతవార్త తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 12న జరిగిన తిరుపతి జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఎంపిక చేసారు. ఈ ఎంపికలు సుమారు ఆరు టీములు పాల్గొన్నారు. జిల్లా రోల్ బాల్ ఎంపికలో అండర్ 11, అండర్ 14, అండర్ 17, అబో 17 ఏజ్ గ్రూపుల్లో. క్రీడాకారులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ క్రీడలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ అనిల్ కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ బాడీ చైర్మన్ వి.జీ. ప్రేమ్ నాథ్, ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజర్ అండ్ తిరుపతి జిల్లా అబ్జర్వర్‌గా విచ్చేసిన లలిత ప్రియా, తిరుపతి జిల్లా శిక్షకులు కావ్య శ్రీ, మహేష్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానం మహాద్భుతం

పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:



త్రినేత్ర దివ్య ధ్యాన దేవాలయం పుత్తూరులో జరిగిన ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ ధ్యాన శిక్షకులు, బొల్లిని జానకమ్మ తిరుపతి వారు నిత్య జీవితంలో ధ్యానం దాని ప్రాముఖ్యత గూర్చి శాస్త్రీయ ఆధారాలతో వివరించారు. ధ్యానంలో మనసు శూన్యమైనప్పుడు శరీరంలో కలిగే సమస్థితిని, స్ట్రెస్ రిలీజ్, హార్మోనుల విడుదల వాటి ప్రభావాలను, తద్వారా ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో వివరించారు.

## వేపగుంటలో డెంగ్యూ క్యాంపస్

పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:



వేపగుంట పంచాయతీలో డెంగ్యూ క్యాంపు నిర్వ హించారు. ఈ క్యాంపు పుత్తూరు ఎంపీపీ ముని వేలు ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ గురించి పరమేశ్వర మంగళ పీహెచ్ నాగభూషణ్‌రెడ్డి, సిబ్బంది, గ్రామ ప్రజలకు సలహా సూచనలు ఇచ్చారు. వర్షాకాలంలో పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని మురికి కాలువలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరిజ ప్రసాద్, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోటా మరణం బాధాకరం - మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:

ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మరణంపై ఆదివారం మాజీ మంత్రి రోజా స్పందించారు. ఆయన మరణం బాధాకరమన్నారు. కోట ఇక లేరన్న వార్త తనను కలిచి వేసిందన్నారు. 750పై చిలుకు చిత్రాల్లో నటించి, విభిన్న పాత్రలతో మెప్పించిన గొప్ప నటుడు కోటా అని కొనియాడారు. ఈ విషాధ సమయంలో వారి కుటుంబానికి దేవుడు ధైర్యాన్ని, శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## విద్యా దానం మహాదానం

పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:

విలువలతో కూడిన విద్యను అందించడంలో గురువులతో పాటు తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు, పుత్తూరు ప్రధాన పాఠశాలలో జరిగిన శ్రీ సరస్వతి మాతా సాంఘిక సేవా సమాజం సమావేశానికి అయిన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సమాజసేవలో విశేష కృషి చేస్తున్న మాడ ప్రసాద్, వారి కుమారులను అయిన అభినందిస్తూ ఈ సమాజం యొక్క సేవాపరిధి పుత్తూరు డివిజన్ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు. సమావేశానికి అతిథులకు స్వాగతం పలికి, ప్రార్థన గీతాన్ని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం ఆలపించగా సమాజ సేవలు గురించి సభాధ్యక్షుడు యుగంధర్ రాజుతో పాటు రవి శంకర్, విద్యాశాఖ అధికారి బాలసుబ్రహ్మణ్యం, కుమరవేలు సుదీర్ఘంగా వివరించారు. దాదాపు 3 లక్షల విలువైన బోధనా సామగ్రిని 6 మండలాల్లోని 25 పాఠశాలలకు చెందిన 750 మంది విద్యార్థులకు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయుల సమక్షంలో ఉప విద్యాశాఖ అధికారి ద్వారా అంద చేయడమైంది. తదుపరి మండల, పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు దాతల ద్వారా నగదు, జ్ఞాపికలు అందించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇద్దరు అనాథ విద్యార్థులను శ్రీ సాయిజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుటకు ఆర్థిక సహాయంను సంస్థ సభ్యులు అందించారు. ఈ సమావేశానికి కె.రవి, జి.దొరస్వామి, ఆర్.ప్రభాకర్‌రాజు, కె.పార్థసారథి, కె.జె.వినోద్‌బాబు, సంతోష్బఆబు, మాడా వెంకటరత్నం, కె.వి.రామ్మోహన్, జయచంద్ర, మోహన్‌రాజు, రవిశేఖర్‌రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్‌సిపి బూత్ కమిటీ జిల్లా కార్యదర్శిగా కోబా ధనంజయరెడ్డి

తిరుపతిరూరల్, జూలై 13 ప్రభాతవార్త:



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ తిరుపతి జిల్లా కార్యదర్శిగా కోబాకు ధనంజయ రెడ్డి నియమితులయ్యారు. ముత్యాలరెడ్డిపల్లికి చెందిన కోబాకు ధనంజయరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన సేవలు గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా బూత్ కమిటీలో చోటు కల్పించారు. వైకాపా బలోపేతానికి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావటానికి కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా వైకాపా సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కార్పొరేటర్ ఆరణి సంధ్య, రాజేష్ వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధనకు సమ్మెకు దిగిన మున్సిపల్ కార్మికులు




వెంకటగిరి, జూలై 13 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12వ తేదీ అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడం జరుగిందని అన్నారు. 13వ తేదీ ఇంజనీరింగ్ కార్మికులు, టెంట్‌లో కూర్చుని నిరసన తెలియజేయడం జరుగిందని అన్నారు. 14, తేదీ, 15వ తేదీలు వంట వార్పు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. 16వ తేదీ నుండి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని అన్నారు. 17వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొని జీతాలు పెంచుకునేంత వరకు సమ్మె కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ విభాగం సిఐటియు నాయకులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, బుజ్జమ్మ మున్సిపల్ యూనియన్ పారిశుధ్య విభాగం సిఐటియు నాయకులు జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, సుబ్బర త్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంత కవిర్ అవార్డుకు ఎంపికైన శ్రీనివాసులు



వెంకటగిరి, జూలై 12 ప్రభాతవార్త : పట్టణం నాలుగో వార్డు వివర్స్ కాలనీకి చెందిన లక్క శ్రీనివాసులు అనే చేనేత కళాకారుడు అవార్డులు కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకుంటున్నారు. చేనేత లు అత్యంత ప్రతిష్టాత్మకమైన సంతకవిర్ అవార్డుకు ఆయన ఎంపిక అయ్యారు. శ్రీనివాసులు కుటుంబం మొత్తం చేనేత పరిశ్రమ పైనే ఆధారపడి జీవిస్తున్నారు. శ్రీనివాసులు వంశమంతం చేనేత కళ పై ఆధారపడి జీవిస్తున్నారు. లక్క శ్రీనివాసులకు 2015వ సంవత్సరంలో జాతీయ అవార్డు వచ్చింది. ఈ అవార్డును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా అందుకున్నారు. 2024 సంవత్సరం గాను సంత కబీర్ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు ఆగస్టు నెల ఏడో తేదీ చేనేత దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీనివాసులకు ఇవ్వనున్నారు. చీర పై లక్ష్మి కటాక్షం బొమ్మలు నేసి ప్రదర్శించగా సంత కబీర్ అవార్డు వచ్చింది. 2015 సంవత్సరంలో రాధాకృష్ణ బొమ్మకు జాతి అవార్డు ను అందుకున్నారు. వెంకటగిరి కళలకు ప్రసిద్ధి అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి చేనేత పరిశ్రమ అభివృద్ధికి తల వంతు కృషి చేస్తానని చెప్పారు.

## కోటేశ్వరరావును కలిసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు



కోట, జులై 13 ప్రభాతవార్త : రాష్ట్ర బిజెపి మాజీ ఉపాధ్యక్షుడు కె.కోటేశ్వరరావును హైదరాబాదులోని ఆయన స్వగృహంలో ఆదివారం రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు పుష్పగుచ్చంతో మాధవ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. వీరిద్దరు పలు విషయాలపై చర్చించుకున్నారు. మాధవ్ తండ్రి దివంగత చలపతిరావు తుదిశ్వాస వరకు జనసంఘ్ నుంచి బిజెపి వరకు అత్యున్నత పదవులు పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి బలోపేతానికి కృషి చేశారని కోటేశ్వరరావు గుర్తు చేశారు. చలపతిరావు జీవితం ఆదర్శవంతమైనదని, బిజెపి కార్యకర్తలు, నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మాధవ్ నాయకత్వంలో బిజెపి రాష్ట్రం నలుమూలలకు విస్తరించి బలమైన శక్తిగా ఎదగాలని కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రకాశం కాలనీలో కార్డెన్ సెర్చ్



కోట, జులై 13 ప్రభాతవార్త : మండలం గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఒక్కసారిగా పోలీసులు ప్రకాశం కాలనీలో జల్లెడ పట్టారు. ఇంటింటా తనిఖీలు చేసి ఆధార్‌కార్డులు పరిశీలించి ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం కాలనీలో విభిన్నరకాల కుటుంబాలు ఉన్నాయి. ఈ తనిఖీలలో వాకాడు సిఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్, వాకాడు ఎస్ఐ నాగబాబు, చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య, పోలీసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గారూ.. తెలుగుగంగ జలాలు విడుదల చేయించండి



కోట, జులై 13 ప్రభాతవార్త : మండలం చిట్టేడు, కేశవరం, ఊనుగుంటపాలెం గ్రామాల్లో వరి పంట ఎండిపోతోందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ జోక్యం చేసుకుని తెలుగుగంగ ఇంజినీర్లతో మాట్లాడి తెలుగుగంగ కాలువకు నీరు విడుదల చేయించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. వరుణ దేవుడు కరుణించలేదని, ఎండిపోతున్న పంటలపై దయ చూపించి తెలుగుగంగ జలాలను విడుదల చేయించాలని రైతులు కోరారు.

## సూళ్లూరుపేటలో కార్డెన్ సెర్చ్




సూళ్లూరుపేట, జులై 13 ప్రభాతవార్త : పట్టణంలోని మహదేవయ్య నగర్, క్రిస్టియన్ పేట ప్రాంతాల్లో ఆదివారం సిఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 10 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వి.బ్రహ్మానాయుడు, కొండప్పనాయుడు, ఎఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోనే : ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి



సత్యవేడు, జూలై 13 ప్రభాతవార్త: పరిపాలనదక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డి నేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సత్యవేడు మండలం మల్లవారిపాళెం తూర్పు, పడమర, ఆరూరు, ఆరూరు కండ్రిగ, అప్పయ్య పాళెం, చెంగంబాకం తదితర గ్రామంలో పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో అన్ని రంగాల్లోను విధ్వంసం వాటిల్లిందన్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షత వల్ల రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు తీస్తున్నట్లు ఆయన తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మెగా డీఎస్సీ, ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం, అన్నా క్యాంటీన్లు ఉన్నట్లు ఆయన వివరించారు. ఇదేగాక పాడి రైతులను ఆదుకునే దిశగా పశువుల షెడ్లు, రాయితీ ధరలపై పశువులు దాన పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే వచ్చే నెలలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేయబోతున్నామన్నారు. ప్రభు త్వ సద్దుద్దేశంతో ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. తదనంతరం పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలసి శ్రీసిటీ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించడంతో పాటు వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి రాగానే డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, పీవీ పురం బాలరాజు, సుబ్రహ్మణ్యం రాజు, మురళి(చికెన్ చిన్న), శశిమోహన్ నాయుడు, జడేరి బాబు, దయ, సురేంద్ర రెడ్డి, నాగలాపురం బాలాజీ రెడ్డి, నారాయణవనం గిరి, పిచ్చాటూరు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

## గత కొన్ని రోజులుగా ఎస్‌బిఐ ఎటిఎంలు ఖాళీ!




శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఎస్‌బిఐ ఎటిఎంలు 15 రోజులుగా పని చేయటంలేదు. దాంతో వినియోగదారుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది. ముఖ్యంగా కోవనూరు ఎస్‌బిఐ, పివిఆర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో వున్న ఎస్‌బిఐ ఏటిఎం మిషన్లు ఎప్పుడు పనిచేస్తాయో తెలియని పరిస్థితి. వృద్ధులు, మహిళలు డబ్బుల కోసం ఏటిఎం చుట్టూ తిరిగి పోతున్నారు. ఏటిఎం కార్డులతో ఎటిఎం కేంద్రాలకు వెళితే ముఖ్యంగా ఎస్‌బిఐ ఎటిఎంలకు వెళితే 'నగదు లేదని' సమాధానం వస్తుంది. బ్యాంకుకు వెళితే క్యూలు చాంతాడంత పొడవు ఉంటుంది. కౌంటర్ వద్దకు వెళ్లినపుడు 'సర్వర్ పని చేయటం లేదని' గుమాస్తా చేతులెత్తేస్తారు. ఎటిఎంలలో సొమ్ములుంటే ఎటిఎం కార్డులతో డ్రా చేసుకునే వారు, కానీ ఎందుకో ఎస్‌బిఐ ఎటిఎంలలో నగదు ఉండటం లేదు. కారణం యంత్రాలు పని చేయటం లేదని, పలుమార్లు మరమ్మతులకు ప్రయత్నించి వెనుదిరుగుతున్నారు. అయితే బ్యాంకర్లు మాకు సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారు. ఎస్‌బిఐ ప్రధాన బ్రాంచిలో తప్ప ఇతర ఎటిఎంలలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. బ్యాంకు నిర్వాహకులను అడిగితే మాకు సంబంధం లేదంటారు. మరి తమ బాధను ఎవరికి మొరబెట్టుకోవాలో తెలియక తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా క్యాష్ పెట్టు ఏజెన్సి జవాబుదారి తనంతో వ్యవహరించి ఖాతాదారులకు సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

**నగదు కోసం భక్తుల తిప్పలు వర్ణనాతీతం:**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి భక్తి భావంతో వచ్చిన వారు ఆలయంలో ఆన్‌లైన్ ఉంటుందని భావించి వస్తున్నారు. ఇక్కడ ఆలయంలో అలాంటి సదుపాయం లేనందువల్ల తెచ్చుకున్న సొమ్ములు ఖాళీ చేసుకొని నగదు కోసం పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో దుకాణాల వద్ద అభ్యర్థిస్తున్నారు. కమిషన్ పట్టుకొని ఇవ్వాలని కోరుతున్నా నగదు ఇచ్చే నాథుడు లేదు. దాంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితి చోటు చేసుకుంది. ఇది శివయ్య సేవకు వచ్చిన భక్తుల పాట్లు. ఇక నెల నెలా పెన్షన్లు పొందే వారు.

## ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి

### -బాండ్లు ఇచ్చారు హామీలు మరచారు -గ్రామ కమిటీలను పటిష్టం చేయాలి - మాజీ మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లి, జూలై 13 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగట్టాలని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైసానీ కళ్యాణ మండపంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మాత్రమే కాకుండా 143 హామీలు ఇచ్చారన్నారు. కూటమి పార్టీల నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు హామీలు నెరవేరుస్తామని సంతకాలు పెట్టి మరీ బాండ్లు సైతం ఇచ్చారని గుర్తు చేసారు. వారిచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాడన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమం విడచిపెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన యేదాది కాలంలోనే చెడ్డపేరు మూటగట్టు కొందన్నారు. గతంలో ఎన్టీఆర్‌ను మోసం చేసి ముఖ్యమంత్రి అయిన తర్వాత వెంటనే చంద్రబాబు మద్యపాన నిషేదాన్ని ఎత్తివేశారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి 5సార్లు పెంచిన ఘనత అతనికి దక్కుతుందన్నారు. అనంతరం వైకాపా విధివిధానాలను వివరించారు. చంద్రబాబు రీకాల్ పేరుతో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వైకాపా నాయకులు పెద్దిరెడ్డి, రెడ్డెప్ప, కృష్ణమూర్తి, నడింపల్లి దామోధర్‌రాజు, మిద్దింటి శంకరనారాయణ, మిద్దింటి కిషోర్‌బాబు, కళ్యాణ్‌భరత్, కూరపర్తి అంజిబాబు, శ్రీరాములు, రుక్మిణమ్మ, అల్తాఫ్, పవన్‌రాయల్, సుధాకర్‌రెడ్డి, నరసింహులుయాదవ్, శ్రీరామ్‌భరత్ వరుణ్, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా : సి.కె.కార్తికేయన్



పుత్తూరు, జూలై 13 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నగరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సి.కె.కార్తికేయన్ అన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో త్వరలో పార్టీ అన్ని విభాగాల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రధాన సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో గతంలో వున్నానని, 2005లో పుత్తూరు మునిసిపాలిటీ 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని వెళతానని తెలిపారు. సమావేశంలో నాయకులు కుమార్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## గజల్ శ్రీనివాస్‌ను ఆహ్వానం



తొట్టంబేడు, జూలై 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని జుంలేపీర్‌షా వలి అల్లాహ్ దర్గాతో ఎంతో ఆధ్యాత్మిక పరిచయం ఉన్న గజల్ శ్రీనివాస్‌ను దర్గా ఉరుసు కమిటి ఆదివారం ఆహ్వానించింది. తిరుపతికి విచ్చేసిన గజల్ శ్రీనివాస్‌ను కలసి ఆయనకు సత్కరించారు. శ్రీకాళహస్తి జుంలేపీర్ షా వలి అల్లాహ్ దర్గాకు ఒకసారి రావాలని కోరారు. ఈ మేరకు దర్గా ముజావర్ సయ్యద్ ఆహమ్మద్, అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, గుమళ్ళ రాజేశ్వరరావు, ఎంఎస్ జమ్రుద్‌బాషా, షాకీర్ అలి, షేక్‌షఫీ, జుంలేషా, షాహి, అమీన్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజా... ఆట మొదలైయ్యింది వెబ్ సీరీస్ షూటింగ్ ప్రారంభం

తిరుపతి విద్య, జూలై 13 ప్రభాత వార్త : కె ఎమ్ ఆర్ ప్రొడక్షన్ పతాకం పై జీ9 ఫిల్మ్ ఫ్యాక్టరీ సహకారం తో నిర్మిస్తున్న " రాజా...! ఆట మొదలైయ్యింది వెబ్ సీరీస్ షూటింగ్ తిరుపతి శెట్టిపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో భీమాస్ అధినేత భీమాస్ అశోక్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. మన భారత దేశం లో పూరాతన శిల్ప సంపదని విదేశీయులు తరలించకుండా జాగ్రత్తగా కాపాడాలనే కథాంశంతో రూపొందిస్తున్న సస్పెన్స్, కామెడీ ఎంటర్టైన్మెంట్ తో తిరుపతి పరిసర ప్రాంతంలో చిత్రీకరణ నూతన నటీ నటులతో జరుగుతుందని, ఇందులో హీరోగా సాయి మోక్షిత్ రెడ్డి, హీరోయిన్ గా యశస్విని, సహ నటులుగా భీమాస్ అశోక్, కామెడి శాస్త్రి, రామి రెడ్డి, శ్యాంబోలు హరి, ప్రియా, భానుపకాష్, గోపి, విల్సన్, గణేష్, రాహుల్, జ్ఞానదీప్, తదితరులు నటిస్తున్నట్లు దర్శకులు క్రిస్టోఫర్ కిరణ్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత కె. హరిబాబు రెడ్డి, ముఖ్య అతిథిగా ఎ పి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ వి. రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళం



సూళ్లూరుపేట, జులై 13 ప్రభాతవార్త : శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఒక లక్షా ఒక వెయ్యి 116 రూపాయలు విరాళం అందింది. గూడూరుకు చెందిన సోమిశెట్టి చెంచురామయ్య కుటుంబ సభ్యులు ఈ చెక్కును దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ అన్నదానానికి దాతలు ముందుకు వచ్చి మరింతగా సహకరించాలని కోరారు. ఈ నెల 18వ తేదీన అమ్మవారికి దేవస్థానం తరపున శాకాంబరి అలంకారం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మణ్ణికి చేసే శాకాంబరి అలంకారానికి అవసరమయ్యే మూడు రకాల కూరగాయలు, రెండు రకాల పండ్లను భక్తులు ఈ నెల 16వ తేదీన సాయంత్రంలోగా దేవస్థానంలో అందజేయాలని కోరారు. భక్తులను అమ్మణ్ణి సేవలో భాగస్వాములు చేసే భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## సాయినగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు



సూళ్లూరుపేట, జులై 13 ప్రభాతవార్త : మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిన అంశాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తూ లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు స్వీకరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు అంచలంచెలుగా ప్రజలకు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, పచ్చా మాధవనాయుడు, ఇవి సురేష్, ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, ఎస్.రాజశేఖర్, శరవణ, గిరి, జోగేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 471వ నేత్రదానం



సూళ్లూరుపేట, జులై 13 ప్రభాతవార్త : పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు ఆదివారం 471వ నేత్రదానం అందింది. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గ్రామ నివాసి కామిరెడ్డి రత్నమ్మ మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## జులవ్వలపాళెం పెద్దచెరువు ఆక్రమణ!



నాయుడుపేట, జూలై 13 ప్రభాతవార్త : గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కంటికి రెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు పర్యవేక్షణలోపం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురౌతున్నాయి. ఈక్రమంలో నాయుడుపేట మండలంలోని, జువ్వలపాళెం పెద్ద చెరువును ఆ గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమణలు చేపట్టి దర్జాగా సాగుకు సన్నద్ధం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. జువ్వలపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 95లో ఉన్న పెద్దచెరువును కొంతమంది ఆక్రమణలకు పాల్పడుతున్నారు. చెరువులో సుమారు పదిఎకరాల వరకు డోజర్‌తో దున్ని సదును చేస్తూ గట్లువేస్తున్నారు. గతకొంత కాలం నుండి చెరువు పైభాగం అంతా ఆక్రమణలకు గురౌతుందని, రెవెన్యూ అధికారులకు పలుదపాలుగా రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. చెరువు ఆక్రమణకు గురికావడంతో పంట చివర దశలో సాగునీరందక అవస్థలు పడుతున్నామని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువును సంరక్షణ చేయాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆక్రమణదారులు బరితెగించి చెరువును ఆక్రమణ చేపట్టి ట్రాక్టర్లతో దున్ని సాగుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్రను వివరణ కోరగా ఆయన మాట్లడుతూ ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమిలో ఎవ్వరు ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోనికి తీసుకువెళ్ళాలి : మాజీఎమ్మెల్యే



నాయుడుపేట, జూలై 13 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోనికి తీసుకువెళ్ళి అర్థమైయ్యే విధంగా తెలియజేయా లని సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీశ్రేణులకు సూచించారు. ఆయన ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం ఆయన చేతుల మీదుగా క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోనికి తీసుకువెళ్ళి ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో సూపర్‌సిక్స్ ద్వార ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేచారని ఆరోపించారు. వృద్ధాప్యపి ంచన్లు, తల్లికివందనం తప్ప మిగిలిన ఏ ఒక్క హామి కూడా నెరవేర్చలేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులతో వేదింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కల్కి మాదవరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు ఓట్టూరు కిషోర్‌యాదవ్, రత్నశ్రీ, భవానిశంకర్, సిద్దయ్య తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హార్ట్స్‌చే పాస్ ప్రతిభావంతులకు నిత్యవసర సరుకులు




తిరుపతి హెల్త్, జులై 13 ప్రభాతవార్త : నగరంలోని పద్మావతిపురం నందు పాస్ మానసిక ప్రతిభావంతుల కేంద్రంలో ఆదవారం నిత్యవసర సరులకును హెల్పింగ్ హార్ట్స్ ప్రతినిధులకు అందజేశారు. పాస్ నిర్వాహకులు మురళీకృష్ణ, శ్రీరాములురెడ్డికి, హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లుపల్లి సురేందర్, సభ్యులు లీలా ప్రకాష్, జయశంకర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భగా హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో ప్రతి నెల రెండవ ఆదివారం అనాధ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, పునరావాస కేంద్రాలకు, ఆసుపత్రుల వంటి పలుచోట్ల వారికి అవసరమైన సరకులు, దుస్తులు అందజేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ సమాజంలో నిరాదరణకు గురైన వారికి సహాయం చేయడం అలవర్చుకోవాలన్నారు.

## వరసిద్ధుని సన్నిధిలో రాష్ట్ర మెప్మా మిషన్ డైరక్టర్



కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెప్మా డిపార్ట్‌మెంట్ మిషన్ డైరక్టర్ తేజ్ భరత్ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీయర్ల చాతుర్మాసదీక్ష



తిరుమల, జూలై 13 ప్రభాతవార్తప్రతినిధి: రామానుజాచార్యుల పారంపర్యంలో విశేషమైన చాతుర్మాస దీక్షలో భాగంగా తిరుమలలోని పెద్దజీయర్‌స్వామి మఠంలో ఆదివారం ఉదయం జీయంగార్లు చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. వైదిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పెద్దజీయర్‌స్వామి మఠం వద్దనుండి చిన్నజీయంగారు, శిష్యబృందంతో కలసి మంగళవాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్‌కు మేల్‌ఛాట్‌వస్త్రాన్ని, చిన్నజీయర్‌కు నూలువస్త్రాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి జీయంగార్లుపాల్గోన్నారు.

## శివయ్య సేవలో నంద్యాల ఎంపి

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆదివారం నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఓ మోహన్ పిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.